


# కెరటం న్యూస్

(సామాన్యుడి ఆయుధం)





Published from.. Hyderabad, Khammam, Warangal, Nalgonda

సంపుటి : 04 సంచిక : 285 | బుధవారం 12 నవంబర్ 2025 | ఎడిటర్ : వనం నాగయ్య | పేజీలు : 4 ఫోన్ : 9441877695

## జూబ్లీహిల్స్ బైపోల్..

ఎమ్మెల్యే సుధీర్ రెడ్డిపై ఈసీకి ఫిర్యాదు



## తమ్ముడిని హత్య చేసిన అన్న



## హైదరాబాద్‌లో అరెస్టైన ఉగ్రవాది

డాక్టర్ మొయినుద్దీన్ నుంచి కీలక సమాచారం



## అందెశ్రీకి పద్మశ్రీ ఇవ్వాలి

సీఎం రేవంత్ రెడ్డి



## మూడు రోజుల పాటు ఎర్రకోట బంద్



## సీఐడీ కార్యాలయంలో హీరో విజయ్ దేవరకొండ



# రాష్ట్రంలో పెట్టుబడుల పండుగ నడుస్తోంది

## ముఖ్యమంత్రి చంద్రబాబు



**న్యూస్ డెస్క్, 11 నవంబర్ (కెరటం న్యూస్):** రాష్ట్రంలో పెట్టుబడుల పండుగ నడుస్తోందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. కనిగిరి నియోజకవర్గంలోని పెదఈర్లపాడులోని ఎంఎస్ఎంఈ పార్కును ఆయన మంగళవారం ప్రారంభించారు. అక్కడి నుంచి వర్చువల్ గా రాష్ట్రవ్యాప్తంగా 17 జిల్లాలోని 50 ఎంఎస్ఎంఈ పార్కులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. రూ.25,256 కోట్ల పెట్టుబడులతో 25 పరిశ్రమలను వర్చువల్ గా ముఖ్యమంత్రి ఆరంభించారు. పారిశ్రామిక వేత్తలతో వీడియో కాన్ఫరెన్సు ద్వారా సంభాషించిన సీఎం చంద్రబాబు చెత్త నుంచి సంపద సృష్టించడమే ఇప్పుడు కొత్త విధానం అన్నారు. కొత్తగా ఏర్పాటవుతున్న కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంట్లు దీనిని అందిపుచ్చుకోవటం సంతోషదాయకమని పేర్కొన్నారు. ఇది రాష్ట్రంలోని రైతులకూ ప్రయోజనం కలిగిస్తుందన్నారు.

**కూటమి ప్రభుత్వ లక్ష్యం**

ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేయటమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి అన్నారు. పారిశ్రామిక పార్కుల్లో విద్యుత్, నీళ్లు, రహదారులు, కామన్ ఇన్ఫ్రాను క్రియేట్ చేస్తున్నామన్నారు. ఆలోచనతో వస్తే చాలు పారిశ్రామిక యూనిట్ పెట్టొచ్చని స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఎంఎస్ఎంఈ పార్కులు, పారిశ్రామిక యూనిట్లకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేసుకుంటున్నాం అన్నారు.

**మొంథా తుఫాన్ సమయంలో**

మొంథా తుఫాన్ సమయంలో అంతా కలిసి పనిచేశాం.. ప్రాణ, ఆస్తినష్టాన్ని తగ్గించామని ముఖ్యమంత్రి చంద్రబాబు గుర్తు చేశారు.

## ఢిల్లీ పేలుడులో అసలు సూత్రధారి లేడీ డాక్టర్

### భారత్‌లో జైషే మహిళా విభాగానికి ఈమే హెడ్!



**న్యూస్ డెస్క్, 11 నవంబర్ (కెరటం న్యూస్):** నవంబరు 10న హర్యానాలోని ఫరీదాబాద్‌లో భారీ ఎత్తున్న పేలుడు పదార్థాలు లభ్యమైన ఘటనలో విస్తుపోయే నిజాలు వెలుగులోకి వస్తున్నాయి. జమ్మూ కశ్మీర్‌కు చెందిన అదీల్ అహ్మద్ రథర్, ముజామిల్ షకీల్‌లను అరెస్ట్ చేసిన పోలీసులు.. 2,900 కిలోల పేలుడు పదార్థాలు, ఆయుధాలను స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే. ఈ కేసులో లక్నోకు చెందిన షహీనా షాహిద్ అనే మహిళా వైద్యురాలిని అరెస్ట్ చేశారు. పాకిస్థాన్‌కు చెందిన ఉగ్రవాద సంస్థ జైషే మహమ్మద్ భారత్‌లో మహిళా విభాగం ఏర్పాటు, నియామకాల్లో డాక్టర్ షహీనా కీలక పాత్ర పోషించినట్టు ఢిల్లీ పోలీసు వర్గాలు వెల్లడించాయి.డాక్టర్ షహీనాకు జైషే మహిళా విభాగం ‘జమాత్ ఉల్ మొమినాత్’ భారత్ చీఫ్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నాయి.

# జూబ్లీహిల్స్ ఎగ్జిట్ పోల్స్

# ఆ పార్టీదే బంపర్ విక్టరీ!


- ☑నాగన్న సర్వే: కాంగ్రెస్ 47 శాతం, బీఆర్ఎస్ 41 శాతం, బీజేపీ 8 శాతం ఓట్లు
- ☑JANMINE సర్వే: కాంగ్రెస్‌కు 42.5 శాతం, బీఆర్ఎస్ 41.5 శాతం, బీజేపీ 11.5 శాతం ఓట్లు
- ☑స్మార్ట్ పోల్: కాంగ్రెస్ 48.2, బీఆర్ఎస్ 42.1 శాతం ఓట్లు
- ☑చాణక్య స్ట్రాటజీ: కాంగ్రెస్ 46 శాతం, బీఆర్ఎస్ 41 శాతం, బీజేపీ 6 శాతం ఓట్లు
- ☑పీపుల్స్ పల్స్: కాంగ్రెస్ 48 శాతం, బీఆర్ఎస్ 41 శాతం, బీజేపీ 6 శాతం ఓట్లు

**న్యూస్ డెస్క్, 11 నవంబర్ (కెరటం న్యూస్):** జూబ్లీహిల్స్ పోలింగ్ ముగిసింది. పలు సర్వే సంస్థలు తమ ఎగ్జిట్ పోల్స్ ద్వారా విజేతను ప్రకటించాయి. అన్ని సంస్థలు కాంగ్రెస్ విజయం సాధిస్తుందని వెల్లడించాయి. దాదాపు 47 నుంచి 48 శాతం ఓటింగ్‌తో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ విజయం సాధిస్తారని పేర్కొనగా.. రెండో స్థానంలో 41 శాతం ఓట్లతో బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత నిలవనుందని వెల్లడించాయి. తుది విజేతను నిర్ణయించే ఓట్ల లెక్కింపు ఈ నెల 14న జరగనుంది.

తెలంగాణ రాజకీయంపై ప్రభావం చూపనున్న జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నిక పోలింగ్ ప్రక్రియ సాయంత్రం 6 గంటలకు ముగిసింది. 4.01 లక్షల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవడానికి అవకాశం లభించింది. ఈ ఉప ఎన్నిక ఫలితం రాష్ట్రంలో ఏ పార్టీ బలంగా ఉందో చెప్పబోతుందనే అంచనాలు ఉండడంతో.. ఇప్పుడు అందరి దృష్టి వివిధ సంస్థలు ప్రకటించబోయే ఎగ్జిట్ పోల్స్పై కేంద్రీకృతమై ఉంది.




## భారత్‌పై సుంకాలను తగ్గిస్తున్నట్టు అమెరికా ప్రకటన.!



**న్యూస్ డెస్క్, 11 నవంబర్ (కెరటం న్యూస్):** సుంకాల పేరిట భారత్‌పై అక్కసు వెళ్లగక్కుతున్న అమెరికా తాజాగా శుభవార్త అందించింది. భారత్‌పై సుంకాలను సగానికి అనగా 50 శాతం తగ్గిస్తున్ననట్టు ఆ దేశ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. రష్యా చమురు కొనుగోళ్లే ఈ సుంకాలు రెట్టింపు కావడానికి ప్రధాన కారణమని ట్రంప్ స్పష్టం చేశారు.

‘రష్యా చమురు కొనుగోళ్ల కారణంగా భారత్‌పై అధిక సుంకాలు ఉన్నాయి. కానీ, ఇప్పుడు భారత్ ఆ కొనుగోళ్లను తగ్గించింది.

## తుఫాను బాధితులకు తక్షణ సాయంగా రూ.12.99 కోట్లు విడుదల



**న్యూస్ డెస్క్, 11 నవంబర్ (కెరటం న్యూస్):** మొంథా తుఫాను కారణంగా నష్టపోయిన వరద బాధితుల కోసం రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వరద బాధిత కుటుంబాలకు రూ.12.99 కోట్లు తక్షణ సాయం అందించాలని నిర్ణయించింది. ఈ మేరకు నిధులు విడుదల చేస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. మొంథా తుఫాను ప్రభావంతో ఇటీవల రాష్ట్రంలోని పలు జిల్లాలో భారీ వర్షాలు కురిసిన విషయం తెలసిందే. ఈ క్రమంలో వరదల్లో నష్టపోయిన కుటుంబాలకు తక్షణ సాయం అందిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

## డాక్టర్ల నిర్లక్ష్యంతో బాలింత మృతి

### హాస్పిటల్‌కు రూ. కోటి జరిమానా



**న్యూస్ డెస్క్, 11 నవంబర్ (కెరటం న్యూస్):** నల్గొండ జిల్లా నార్కట్‌పల్లిలోని కామినేని హాస్పిటల్ వైద్యుల నిర్లక్ష్యంపై జిల్లా వినియోగదారుల ఫోరం సంచలన తీర్పును వెలువరించింది. వైద్యుల తప్పిదం కారణంగా ఓ బాలింత మరణించిన కేసులో మృతురాలి కుటుంబానికి రూ. కోటి పరిహారం చెల్లించాలని ఫోరం ఆదేశించింది. వివరాల్లోకి వెళితే.. నల్గొండ జిల్లా చిట్యాల మండలం ఆరెగూడెం గ్రామానికి చెందిన అస్నాల స్వాతి డెలివరీ కోసం 2018 జూలై 13న కామినేని హాస్పిటల్‌లో చేరింది. డాక్టర్లు ఆమెకు అనస్థీషియా ఇచ్చి ఆపరేషన్ చేసి శిశువును బయటకు తీశారు. అయితే, మరుసటి రోజు ఉదయం 9:15 గంటల వరకు కూడా స్వాతికి స్పృహ రాకపోవడంతో కుటుంబ సభ్యులకు అనుమానం కలిగింది. డాక్టర్లను ప్రశ్నించగా, మత్తుమందు డోస్ సరిపోకపోవడంతో రెండో డోస్ ఇచ్చామని అందుకే స్పృహ రావడానికి ఆలస్యం అవుతుందని సమాధానం ఇచ్చారు. కుటుంబ సభ్యులు గ్రామ పెద్దలకు సమాచారం ఇవ్వడంతో వారు ఆసుపత్రికి వచ్చి నిలదీశారు. ఈ సమయంలోనే స్వాతిని ఐసీయూలోకి తరలించారు.

## తెలంగాణ రైతులకు గుడ్‌న్యూస్..

### అకౌంట్లలోకి డబ్బులు, మంత్రి కీలక ప్రకటన



**న్యూస్ డెస్క్, 11 నవంబర్ (కెరటం న్యూస్):** తెలంగాణలో వరి ధాన్యం, పత్తి, మొక్కజొన్న, సోయాచిక్కుడు వంటి ప్రధాన పంట ఉత్పత్తుల కొనుగోళ్లను యుద్ధ ప్రాతిపదికన వేగవంతం చేయాలని రాష్ట్ర పౌరసరఫరాలు, వ్యవసాయ శాఖల మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. రైతులకు వారి ఉత్పత్తులకు సంబంధించిన చెల్లింపులను సకాలంలో పూర్తి చేయాలని, నిల్వ, రవాణా సౌకర్యాలను కల్పిస్తూ క్షేత్రస్థాయిలో నిరంతర పర్యవేక్షణ ఉండాలని వారు సూచించారు. ప్రతికూల వాతావరణ పరిస్థితుల దృష్ట్యా అప్రమత్తంగా ఉంటూ, పంటలు నష్టపోకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

సోమవారం సెక్రటేరియట్ నుంచి జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రులతో పాటు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రులు రాష్ట్రంలో పంటల సేకరణ స్థితిగతులపై సమీక్షించారు. పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. ధాన్యం కొనుగోళ్లలో తెలంగాణ ఈ సీజన్‌లో ఇప్పటికే కొత్త మైలురాయిని అధిగమించిందని తెలిపారు.

కెరటం న్యూస్
బుధవారం 12 నవంబర్ 2025

# హైదరాబాద్‌లో అరెస్టైన ఉగ్రవాది

## డాక్టర్ మొయినుద్దీన్ నుంచి కీలక సమాచారం

**న్యూస్ డెస్క్, 11 నవంబర్ (కెరటం న్యూస్):** రాజేంద్రనగర్‌కు చెందిన ఉగ్రవాది డాక్టర్ సయ్యద్ మొయినుద్దీన్‌ను గుజరాత్ యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్ అరెస్టు చేసింది. భారీ స్థాయిలో విష ప్రయోగం చేసి అమాయక ప్రజలను చంపాలని కుట్ర పన్నినట్లు ఏటీఎస్ అధికారులు గుర్తించారు. అయితే, సయ్యద్ మొయినుద్దీన్ అత్యంత ప్రమాదకరమైన 'రెసిన్' విషాన్ని తయారు చేస్తున్నట్లు విచారణలో తేలింది. దేవాలయాలు, వాటర్ ట్యాంకులలో ఈ విషాన్ని కలిపేందుకు కుట్ర పన్నినట్లు అధికారులు పేర్కొన్నారు. ఉగ్రవాది మొయినుద్దీన్ వద్ద నుంచి రెసిన్ తయారీకి సంబంధించిన ముడి పదార్థాలు, పరికరాలను గుజరాత్ ఏటీఎస్ స్వాధీనం చేసుకుంది. ఇక, పాకిస్థాన్ నుంచి వచ్చిన ఉగ్రవాద హ్యాండ్లర్ ఆదేశాల మేరకే ఉగ్రవాది మొయినుద్దీన్ ఈ రెసిన్ విషాన్ని తయారు చేస్తున్నట్లు యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్ అధికారులు ధృవీకరించారు. ఇతను నిషేధిత ఉగ్రవాద సంస్థ 'ఇస్లామిక్ స్టేట్ – ఖొరాసన్ ప్రావిన్స్' కు చెందిన హ్యాండ్లర్ అబు ఖాదిమ్‌తో కూడా సంప్రదింపులు జరిపినట్లు తెలుస్తుంది. అయితే, డాక్టర్ మొయినుద్దీన్ చైనాలో ఎంబీబీఎస్ పూర్తి చేసి హైదరాబాద్‌కు తిరిగి వచ్చాడు. అనంతరం ఆన్‌లైన్ ద్వారా వైద్య చికిత్సలు అందిస్తూ, ఒకవైపు టెర్రరిస్టు కార్యకలాపాల్లో భాగం అయ్యాడు. ఉగ్రవాద దాడుల కోసం నిధులు సేకరించడం, కొత్త వారిని రిక్రూట్ చేసుకునే ప్లాన్‌లో కూడా ఇతడు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఈ కుట్రకు సంబంధించి డాక్టర్ సయ్యద్ మొయినుద్దీన్‌తో పాటు మరో నలుగురిని కూడా గుజరాత్ ఏటీఎస్ ఇప్పటికే అదుపులోకి తీసుకుంది.

# అందెశ్రీకి పద్మశ్రీ ఇవ్వాలి: సీఎం రేవంత్ రెడ్డి

**న్యూస్ డెస్క్, 11 నవంబర్ (కెరటం న్యూస్):** తెలంగాణ ప్రముఖ కవి, రచయిత అందెశ్రీ అకాల మరణం యావత్ తెలంగాణను షాక్ కు గురి చేసిన విషయం తెలిసిందే. సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలతో ఆయన అంత్యక్రియలు మంగళవారం ఘట్కేసర్ పట్టణ కేంద్రంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం సమీపంలో హెచ్‌ఎండిఏ స్థలంలో అంత్యక్రియలు అధికారిక లాంఛనాలతో ముగిశాయి. అందెశ్రీ అంతియ యాత్రలో సీఎం రేవంత్‌రెడ్డితో పాటు మంత్రులు శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్, జూపల్లి కృష్ణారావు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత వీహెచ్, అందెశ్రీ అభిమానులు, సాహితీ ప్రియులు భారీ సంఖ్యలో హాజరయ్యారు. ఆయన అంత్యక్రియలు పూర్తయిన తర్వాత సీఎం రేవంత్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. అందెశ్రీని కోల్పోవడం తనకు వ్యక్తిగతంగా తీరని లోటు అని చెప్పుకొచ్చారు. అలాగే ఆయన తెలంగాణ కోసం చేసిన సేవలను గుర్తుంచుకొని.. పాఠ్య పుస్తకాల్లో జయ జయహే తెలంగాణ గీతం పెడతామని అన్నారు.

అందెశ్రీ కుటుంబంలో ఒకరికి ప్రభుత్వం ఉద్యోగం ఇస్తామని, త్వరలోనే అందెశ్రీ స్మృతివనం ఏర్పాటు చేస్తామన్నారు. ఆయన పాటల సంకలనం "నిప్పుల వాగు" ఒక భగవద్గీతగా, బైబిల్‌గా, ఖురాన్‌గా తెలంగాణ సమస్యలపై పోరాడేవారికి గైడ్‌గా ఉపయోగపడుతుందని, ఆయన రచనలతో 20 వేల పుస్తకాలను ముద్రించి తెలంగాణలోని ప్రతీ లైబ్రరీలో "నిప్పుల వాగు" ను అందుబాటులో ఉంచుతామని రేవంత్ రెడ్డి చెప్పుకొచ్చారు. అలాగే అందెశ్రీకి పద్మశ్రీ ఇవ్వాలని కేంద్రాన్ని కోరతామని, కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ దీనికి సహకరించాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలుగా కలిసి అందెశ్రీని పద్మశ్రీ తో గౌరవించుకునేందుకు కృషి చేద్దామని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు.

# సీఐడీ కార్యాలయంలో హీరో విజయ్ దేవరకొండ

**న్యూస్ డెస్క్, 11 నవంబర్ (కెరటం న్యూస్):** బెట్టింగ్ యాప్స్ కేసు లో తెలంగాణ సీఐడీ దూకుడు ప్రదర్శిస్తోంది. ఈ కేసులో విచారణకు హాజరు కావాలని ఇప్పటికే సినీ హీరో విజయ్ దేవరకొండ, నటుడు ప్రకాశ్ రాజ్ లకు సీఐడీ నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. మంగళవారం వీరిద్దరూ విచారణకు హాజరయ్యారు. వీరి స్టేట్‌మెంట్‌ను అధికారులు రికార్డు చేశారు. కాగా, ఇటీవలే బెట్టింగ్ యాప్స్ కేసులో తెలంగాణ సీఐడీ కీలక ఆపరేషన్ చేపట్టింది. గుజరాత్, రాజస్థాన్, పంజాబ్ రాష్ట్రాల్లోని ఆరు ప్రాంతాల్లో సోదాలు నిర్వహించి 8 మందిని అరెస్టు చేసింది. వీరంతా 6 బెట్టింగ్ యాప్‌లను నిర్వహిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. తాజ్ 007, ఫెయిర్‌ప్లే లైవ్, ఆంధ్ర 365, వీఎల్ బుక్, తెలుగు 365, యస్ 365 బెట్టింగ్ యాప్‌లను ఈ ముఠా నిర్వహిస్తోంది.

# జూబ్లీహిల్స్ ఎగ్జిట్ పోల్స్..ఆ పార్టీదే బంపర్ విక్టరీ!

ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ (బీఆర్ఎస్) మరణంతో అనివార్యమైన ఈ ఉప ఎన్నికలో మొత్తం 58 మంది అభ్యర్థులు బరిలో ఉన్నప్పటికీ, ప్రధాన పోరు మాత్రం ముగ్గురి మధ్యే నడిచింది. బీఆర్ఎస్ తరఫున దివంగత ఎమ్మెల్యే భార్య మాగంటి సునీత, కాంగ్రెస్ పక్షాన నవీన్ యాదవ్, భారతీయ జనతా పార్టీ (భాజపా) నుంచి లంకల దీపక్‌రెడ్డి తలపడ్డారు. ఈ పోలింగ్ సరళి మూడు ప్రధాన పార్టీలకు అత్యంత ప్రతిష్టాత్మకంగా మారింది.

జూబ్లీహిల్స్ చరిత్రను పరిశీలిస్తే.. ఇక్కడ పోలింగ్ శాతం ఎప్పుడూ తక్కువగా ఉంటుంది. గత ఎన్నికల్లో (2023) 47.58% ఓట్లు మాత్రమే పోలయ్యాయి. ఈ ఉప ఎన్నికలో పోలింగ్ సుమారుగా 50 శాతానికి పైగా నమోదు అవ్వనున్నట్లు అధికారులు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ 47.16 శాతంగా నమోదు కాగా.. ప్రస్తుతం క్యూ లైన్లో ఉన్నవారికి ఓటు వేసేందుకు అవకాశం కల్పించారు. దీంతో ఈ పోలింగ్ శాతం పెరిగే అవకాశం ఉంది. ఈ పోలింగ్ శాతం ఏ పార్టీకి లాభిస్తుందనే అంశంపై రాజకీయ విశ్లేషకులు దృష్టి పెట్టారు. సాధారణంగా తక్కువ పోలింగ్ పట్టణ ప్రాంతాల్లో అధికార వ్యతిరేక ఓటును ప్రభావితం చేయవచ్చని ఒక వాదన ఉండగా, సంప్రదాయ ఓటు బ్యాంకు బలంగా ఉన్న పార్టీకి మేలు చేస్తుందనే అభిప్రాయం కూడా ఉంది.




# బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత అరెస్ట్



**న్యూస్ డెస్క్, 11 నవంబర్ (కెరటం న్యూస్):** జూబ్లీహిల్స్ ఉపఎన్నిక పోలింగ్ వేళ షాకింగ్ ఘటన చోటుచేసుకుంది. బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి మాగంటి సునీతను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎన్నికల నియమావళికి విరుద్ధంగా పోలింగ్ కేంద్రం వద్ద ఆందోళన చేసినందుకు ఆమెను, హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డిని పోలీసులు అరెస్ట్ చేశారు. మరోవైపు.. ఉప ఎన్నిక పోలింగ్ ముగిసింది. సాయంత్రం 6గంటల వరకు క్యూలో ఉన్నవారికి.. ఓటు వేసేందుకు అధికారులు అవకాశం కల్పించారు. ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్(బీఆర్ఎస్) మృతితో ఉప ఎన్నిక నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. 58 మంది అభ్యర్థులు బరిలో ఉన్నా.. ముగ్గురి మధ్యే ప్రధాన పోటీ ఉంది. కాంగ్రెస్ తరఫున నవీన్ యాదవ్, బీఆర్ఎస్ తరఫున మాగంటి సునీత, బీజేపీ తరఫున లంకల దీపక్‌రెడ్డి పోటీ చేస్తున్నారు. గెలుపుపై ఎవరికి వారు ధీమాగా ఉన్నారు. ఈ నెల 14న ఓట్ల లెక్కింపు జరగనుంది.

# భారత్‌పై సుంకాలను తగ్గిస్తున్నట్టు అమెరికా ప్రకటన.!

**న్యూస్ డెస్క్, 11 నవంబర్ (కెరటం న్యూస్):** సుంకాల పేరిట భారత్‌పై అక్కసు వెళ్లగక్కుతున్న అమెరికా తాజాగా శుభవార్త అందించింది. భారత్‌పై సుంకాలను సగానికి అనగా 50 శాతం తగ్గిస్తున్ననట్టు ఆ దేశ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. రష్యా చమురు కొనుగోళ్లే ఈ సుంకాలు రెట్టింపు కావడానికి ప్రధాన కారణమని ట్రంప్ స్పష్టం చేశారు. 'రష్యా చమురు కొనుగోళ్ల కారణంగా భారత్‌పై అధిక సుంకాలు ఉన్నాయి. కానీ, ఇప్పుడు భారత్ ఆ కొనుగోళ్లను తగ్గించింది. ఫలితంగా.. మేము ఆ సుంకాలను సగానికి తగ్గిస్తున్నాం.' అని ట్రంప్ అన్నారు. అంతకముందు భారత్‌తో వాణిజ్య సంబంధాలలో తగ్గుదల గురించి ట్రంప్ సూచనప్రాయంగా మాట్లాడుతూ.. తాము ఇండియాతో వాణిజ్య ఒప్పందానికి అతి దగ్గరగా ఉన్నామని, భారతీయ వస్తువులపై విధించిన అధిక సుంకాలను త్వరలో తగ్గించే అవకాశమున్నట్టు చెప్పారు. ఈ సందర్భంగా ట్రంప్.. ప్రధాని మోదీని కూడా ప్రశంసించారు.

భారత్.. రష్యా నుంచి చమురు కొనుగోళ్లు చేస్తుందన్న కారణంతో.. తొలుత 25 శాతం సుంకాన్ని విధించారు ట్రంప్. ఆ తర్వాత దాన్ని 50 శాతానికి పెంచారు. రష్యా నుంచి చమురు, ఆయుధాలను కొనుగోలు చేయడం ద్వారా రష్యా–ఉక్రెయిన్ యుద్ధంలో భారత్.. రష్యాకు ఆర్థికంగా మద్దతిస్తోందని ట్రంప్ ఆరోపించిన విషయం తెలిసిందే.

# తుఫాను బాధితులకు తక్షణ సాయంగా రూ.12.99 కోట్లు విడుదల

రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాల్లో వర్షాలతో దెబ్బతిన్న ఇళ్ళకు రూ.15,000 చొప్పున సాయం అందిస్తూ రెవిన్యూ విభాగం ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్ కుమార్ ఉత్తర్వులు విడుదల చేశారు. జిల్లా కలెక్టర్లు పంపించిన నివేదికల ప్రకారం 15 జిల్లాల్లో 8662 ఇండ్లు దెబ్బతినగా.. వీరికి తక్షణ సాయంగా రూ.12.99 కోట్లు ప్రభుత్వం విడుదల చేసింది. ఈ నిధులను నేరుగా బాధిత కుటుంబాల బ్యాంక్ ఖాతాలో జమ చేయనున్నారు.

కాగా.. అక్టోబర్ 27 నుంచి 30 వరకు వరుసగా నాలుగు రోజులు రాష్ట్రంలోని 16 జిల్లాల్లో భారీ వర్షాలు కురిశాయి. వరంగల్, హన్మకొండ, వికారాబాద్, వనపర్తి, రంగారెడ్డి, కరీంనగర్, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, యాదాద్రి భువనగిరి, సిద్ధిపేట, రాజన్న సిరిసిల్ల, ములుగు, మహబూబాబాద్, సూర్యాపేట, భద్రాద్రి కొతగూడెం, నల్గొండ జిల్లాలు భారీ వర్షాలకు తీవ్రంగా ప్రభావితమైన విషయం తెలిసిందే.

# తమ్ముడిని హత్య చేసిన అన్న

**న్యూస్ డెస్క్, 11 నవంబర్ (కెరటం న్యూస్):** తన భార్యతో వివాహేతర సంబంధం కొనసాగిస్తునాన్నరన్న అనుమానంతో తోడుబుట్టిన తమ్ముడినే అన్న హత్య చేశాడు. ఘటన రాయచూరు జిల్లా సింధనూరు తాలూకాలోని వెంకటేశ్వర క్యాంప్‌లో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. సురేశ్ అలియాస్ సూరిబాబు(38), రాజు అలియాస్ ఎమ్మిరాజు(32) ఇద్దరు స్వయాన అన్నదమ్ములు తమ్ముడు హైదరాబాద్ లో ల్యాండ్రీ దుకాణం నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నాడు. అన్న సూరిబాబు స్వంత గ్రామంలో ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తున్నారు.

ఈ క్రమంలో ఆదివారం హైదరాబాద్ నుంచి స్వంత గ్రామానికొచ్చిన తమ్ముడు అన్నతో కలిసి రాత్రి పూటుగా మద్యం సేవించారు. తాగిన మత్తులో ఇద్దరు ఘర్షణకు దిగగా మాటల మధ్యలో వదిన ప్రస్తావన రావడంతో తమ్ముడిపై అనుమానం పెంచుకున్న అన్న కొడవలితో తలపై బలంగా బాదాడు. దీంతో తీవ్ర రక్తస్రావానికి గురైన తమ్ముడు రాజు అక్కడికక్కడే కుప్పకూలి పడ్డాడు. విషయం తెలుసుకున్న సింధనూరు రూరల్ పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.

# జూబ్లీహిల్స్ బైపోల్.. ఎమ్మెల్యే సుధీర్ రెడ్డిపై ఈసీకి ఫిర్యాదు

**న్యూస్ డెస్క్, 11 నవంబర్ (కెరటం న్యూస్):** బీఆర్ఎస్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డిపై కాంగ్రెస్ నేతలు ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. సుధీర్ రెడ్డి ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తూ ఓటర్లను ప్రలోభపెడుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. స్థానికుడు కాని, ఎల్బీనగర్ ఎమ్మెల్యే అయిన సుధీర్ రెడ్డికి జూబ్లిహిల్స్ లో ఓటు హక్కు లేదని అయినా ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తూ ఇక్కడే తిరుగుతున్నారని ఆరోపించారు. హబీబ్ ఫాతిమానగర్‌లోని పోలింగ్ బూత్ నం. 110 నుండి 120 వరకు ఆయన ప్రచారం చేస్తూ ఓటర్లను ప్రభావితం చేస్తున్నారని ఫిర్యాదు చేశారు. అంతేకాకుండా బీఆర్ఎస్ పార్టీకే ఓటు వేయాలంటూ స్థానిక ఓటర్లను బెదిరిస్తున్నారని దీనివల్ల ఫలితాలపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. సుధీర్ రెడ్డి, అతని అనుచరులను జూబ్లిహిల్స్ లోకి వచ్చేందుకు అనుమతి నిరాకరించాలని కోరారు. ఎన్నికలు సజావుగా సాగేలా చూడాలని పేర్కొన్నారు.

# డాక్టర్ల నిర్లక్ష్యంతో బాలింత మృతి

## హాస్పిటల్‌కు రూ. కోటి జరిమానా

14వ తేదీ ఉదయం స్వాతి ఉన్న బెడ్ అంతా రక్తంతో నిండిపోవడాన్ని చూసి ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు ప్రశ్నించగా.. ఆమె కోమాలోకి వెళ్లిందని వంద మందిలో ఒకరికి ఇలా జరుగుతుందని డాక్టర్లు చెప్పారు. ఆ తర్వాత ఉదయం 9:15 గంటలకు స్వాతి భర్త క్రాంతికుమార్‌తో 'హైరిస్క్' పేపర్‌పై సంతకం చేయించుకుని సుమారు గంటన్నర తర్వాత ఆమె చనిపోయినట్లు ప్రకటించారు.

దీంతో కామినేని డాక్టర్లు మాధవి, సునీతా మిశ్రా, ప్రసాద్, మారుతి సహా ఆసుపత్రి యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగానే స్వాతి మరణించిందని ఆరోపిస్తూ ఆమె భర్త క్రాంతికుమార్, తండ్రి సత్యనారాయణ.. అడ్వకేట్ మేరెడ్డి నర్సింహారెడ్డి ద్వారా నల్గొండ జిల్లా వినియోగదారుల ఫోరంను ఆశ్రయించారు. కేసును పూర్తిస్థాయిలో విచారించిన ఫోరం కామినేని డాక్టర్ల నిర్లక్ష్యం స్పష్టంగా ఉందని నిర్ధారించింది. ఈ మేరకు బాధిత కుటుంబానికి రూ. కోటి పరిహారం చెల్లించాలని తీర్పు ఇచ్చింది. పరిహారంలో రూ. 90 లక్షలను స్వాతి కుమారుడు దేవాన్ష్ శౌర్య పేరున జాతీయ బ్యాంకులో డిపాజిట్ చేయాలని మిగతా రూ. 10 లక్షలను స్వాతి తండ్రి సత్యనారాయణకు చెల్లించాలని ఆదేశించింది. అదనంగా రూ. లక్ష ఫైన్‌ను కూడా బాధిత కుటుంబానికే చెల్లించాలని తీర్పునిచ్చింది. ఈ పరిహారం మొత్తాన్ని నెల రోజుల్లోగా చెల్లించాలని, లేదంటే 9 శాతం వడ్డీని కలిపి చెల్లించాల్సి ఉంటుందని ఫోరం ఉత్తర్వుల్లో పేర్కొంది.

# మూడు రోజుల పాటు ఎర్రకోట బంద్

**న్యూస్ డెస్క్, 11 నవంబర్ (కెరటం న్యూస్):** దేశ రాజధాని ఢిల్లీలో ఉన్న ఎర్రకోట సమీపంలో సోమవారం రాత్రి ఏడు గంటలకు కారు పేలుడు ఘటన జరిగిన విషయం తెలిసిందే. ఆ పేలుడు ధాటికి 13 మంది మృతిచెందగా, 20 మంది వరకు గాయపడ్డారు. అయితే ఈ నేపథ్యంలో ఎర్రకోటను బంద్ చేశారు. రాబోయే మూడు రోజుల పాటు విజిటర్స్‌కు ఎర్రకోట బంద్ ఉంటుందని అధికారులు చెప్పారు. ఆర్కియాలజీ సర్వే ఆఫ్ ఇండియా దీనిపై ప్రకటన చేసింది. కారు బాంబు పేలుడు జరిగిన ప్రదేశంలో ప్రస్తుతం ఫోరెన్సిక్ ఇన్వెస్టిగేషన్ జరుగుతున్నది. అయితే ప్రజలు భారీ స్థాయిలో గుమ్మికూడే అవకాశం ఉన్న నేపథ్యంలో ఎర్రకోటను బంద్ చేస్తున్నట్లు ఏఎస్ఐ ప్రకటించింది.

కారు పేలుడుకు, ఫరీదాబాద్ టెర్రర్ మాడ్యూల్‌కు లింకు ఉన్నట్లు ప్రాథమిక విచారణ ద్వారా వెల్లడవుతున్నది. పేలడు కోసం డిటోనేటర్లు వాడినట్లు అనుమానిస్తున్నారు. అమోనియం నైట్రేట్ రసాయనం వాడి ఉంటారని భావిస్తున్నారు. సూసైడ్ బాంబర్ డాక్టర్ ఉమర్ మహమ్మద్ పేలుడుకు ముందు తన కారును ఎర్రకోట పార్కింగ్ ఏరియాలో సుమారు మూడు గంటల పాటు పార్కింగ్ చేశాడు. పేలుడు విచారణ చేపడుతున్న పోలీసులు.. పుల్వామాలో ఉన్న డాక్టర్ ఉమర్ ఫ్యామిలీని అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనతో లింకున్న నలుగుర్ని ఇప్పటి వరకు అరెస్టు చేశారు. రెడ్‌ఫోర్ట్ మెట్రో స్టేషన్‌ను మంగళవారం మూసివేశారు.

# తెలంగాణ రైతులకు గుడ్‌న్యూస్..

## అకౌంట్లలోకి డబ్బులు, మంత్రి కీలక ప్రకటన

ఇప్పటివరకు 8.54 లక్షల టన్నుల కొనుగోళ్లు పూర్తయ్యాయని, ఇది గత సంవత్సరంతో పోలిస్తే దాదాపు రెండింతలు ఎక్కువ అని వెల్లడించారు. కొనుగోలు చేసిన ధాన్యంలో 3.95 లక్షల టన్నుల సన్నాలు, 4.59 లక్షల టన్నుల దొడ్డు ధాన్యం ఉన్నాయి.

ఈ ఏడాది 1,21,960 మంది రైతులు తమ రూ.2,041.44 కోట్ల విలువైన ధాన్యాన్ని విక్రయించారని.. అందులో ఇప్పటికే రూ.832.90 కోట్లు చెల్లించామని, మిగిలిన రూ.1,208.54 కోట్లు 48 గంటల్లో రైతుల ఖాతాల్లో జమ చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. అలాగే గతేడాది రూ.43.02 కోట్లుగా ఉన్న సన్నాల బోనస్ మొత్తం ఈ సంవత్సరం రూ.197.73 కోట్లకు పెరిగిందని, అందులో రూ.35.72 కోట్లు చెల్లించినట్లు తెలిపారు. ఇప్పటివరకు 45 శాతం ధాన్యం కొనుగోలు పూర్తి కాగా.. రాబోయే నాలుగు వారాల్లో మిగిలిన 55 శాతం పూర్తి చేసి మొత్తం 80 లక్షల టన్నుల కొనుగోలు లక్ష్యాన్ని చేరుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. వర్షాల కారణంగా తడిసిన ధాన్యాన్ని వెంటనే బాయిల్డ్ రైస్ మిల్లులకు తరలించాలని, అందుకు సంబంధించిన కోటా ప్రతిపాదనలు త్వరగా పంపాలని ఆదేశించారు.వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. మొంథా తుపాను నుంచి రైతులు కొంతవరకు కోలుకుంటున్న తరుణంలో మళ్లీ వర్షాలు లేదా పాలనాపరమైన జాప్యాల వల్ల రైతులు నష్టపోకూడదని అన్నారు. పంటల సేకరణకు నవంబర్ నెల అత్యంత కీలకమని, ధాన్యం తడవకుండా ఉండేందుకు ప్రతి కొనుగోలు కేంద్రంలో టార్పాలిన్ షీట్లను అందుబాటులో ఉంచాలని సూచించారు. పత్తి కొనుగోళ్ల విషయంలో ఎకరాకు ఉన్న 7 క్వింటాళ్ల పరిమితిని 12 క్వింటాళ్లకు పెంచాలని అలాగే తేమ శాతం నిబంధనలను కూడా సడలించాలని కోరుతూ కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తున్నట్లు మంత్రి తెలిపారు. వర్షాల కారణంగా రంగు మారిన సోయాబీన్ పంటను కూడా కొనుగోలు చేయడానికి అనుమతి ఇవ్వాలని కేంద్రాన్ని కోరుతున్నట్లు పేర్కొన్నారు.

# రాష్ట్రంలో పెట్టుబడుల పండుగ నడుస్తోంది

## ముఖ్యమంత్రి చంద్రబాబు

యువతకు ఉద్యోగాలు ఇవ్వటం కాదు.. పారిశ్రామికవేత్తగా చేస్తామని చెప్పి చేసి చూపిస్తున్నామని ప్రకటించారు. సమస్యల సుడిగుండంలో ఉన్న రాష్ట్రంలో 17 నెలల క్రితం పాలనా పగ్గాలు చేపట్టామన్నారు. ఏపీ బ్రాండ్ ను పునరుద్ధరిస్తామని చెప్పామని పేర్కొన్నారు. చెప్పినట్లుగా చేస్తున్నామని ముఖ్యమంత్రి తెలియజేశారు.

ఆ నిధులు ఉండి ఉంటే

గత ప్రభుత్వం పీపీఏలు రద్దు చేసిందని ముఖ్యమంత్రి ధ్వజమెత్తారు. దానివల్ల కరెంటు వాడుకోకుండానే రూ.9 వేల కోట్లు ప్రజాధనం చెల్లించారని వెల్లడించారు. ఆ నిధులే ఉండిఉంటే అనేక ప్రాజెక్టులు కట్టుకునేవాళ్లమని తెలియజేశారు. అన్ని విధాలుగా గత పాలకులు రాష్ట్రాన్ని విధ్వంసం చేశారని విమర్శించారు.

గతంలో ఛలో ఛలో.. ఇప్పుడు భలే భలే

గత ప్రభుత్వంలో ఛలోఛలో అని పారిశ్రామిక వేత్తలు వెళ్లిపోతే.. ఇప్పుడు భలేభలే అంటూ పారిశ్రామికవేత్తలు రాష్ట్రానికి వస్తున్నారన్నారు. విశాఖకు లక్ష కోట్ల పెట్టుబడితో గూగుల్ కంపెనీ వస్తోందన్నారు. ఇదీ కూటమి ప్రభుత్వంపై కంపెనీలకు ఉన్న విశ్వాసమన్నారు. కేంద్రం ఏ పాలసీ తీసుకువచ్చినా వాటిని మొదట అమలు చేస్తోంది ఏపీనే అని స్పష్టం చేశారు. ప్రధాని మోదీ ఏది మొదలు పెట్టినా ఏపీలో తక్షణం అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రభుత్వానికి పూర్తి సహకారం ఇస్తున్నారన్నారు. పట్టువదలని విక్రమార్కుడిలా మంత్రి లోకేష్ పనిచేస్తున్నారని ప్రకటించారు.

జనవరి నాటికి మరో 70 పార్కులు

50 ఎంఎస్ఎంఈ పార్కుల్లో 15 ప్రారంభోత్సవాలు, 35కి శంకుస్థాపన చేశామన్నారు. జనవరి నాటికి మరో 70 ఎంఎస్ఎంఈ పార్కులను ప్రారంభిస్తామని ముఖ్యమంత్రి తెలిపారు. 175 నియోజకవర్గాల్లోనూ పారిశ్రామిక పార్కులు ఏర్పాటు చేసి ప్రతీ కుటుంబంలోనూ ఒక ఔత్సాహిక పారిశ్రామిక వేత్తను తయారుచేస్తామన్నారు. నేడు 99 కంపెనీల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసుకుంటున్నామన్నారు. వీటి ద్వారా రూ.2.65 లక్షల కోట్ల పెట్టుబడులు వస్తున్నాయి. దీంతో 2 లక్షల మందికి పైగా ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు వస్తాయని ప్రకటించారు. 25 సంస్థలు ఉత్పాదక దశకు వచ్చాయని, వాటిని ప్రారంభించుంటుకున్నామని చెప్పారు.

అమరావతిలో క్వాంటం కంప్యూటింగ్

భవిష్యత్ అంతా టెక్నాలజీదేనని, క్వాంటం కంప్యూటింగ్ జనవరికి అమరావతిలో ప్రారంభం అవుతుందని ముఖ్యమంత్రి తెలిపారు. ప్రపంచానికి క్వాంటం కంప్యూటర్లను మన రాష్ట్రం నుంచి ఉత్పత్తి చేసి పంపించేలా పరిస్థితి మారుతుందని ధీమా వ్యక్తం చేశారు. సౌర విద్యుత్ ఉత్పత్తిని ఇంటి నుంచే తయారు చేసుకునేలా ప్యానెల్స్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. రిలయన్స్ బయో ఫ్యూయెల్ ప్లాంట్లు ఏర్పాటు చేస్తోందని.. తక్కువ వ్యయంతో విద్యుత్ ఉత్పత్తి చేసేలా గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి చేస్తున్నామని తెలియజేశారు. డ్రోన్ సిటీని ఓర్వకల్లు లో ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఆపరేషన్ సింధూర్ లో వాడిన డ్రోన్లను కూడా ఇక్కడే టెస్ట్ చేశారని ముఖ్యమంత్రి తెలిపారు.

# ఢిల్లీ పేలుడులో అసలు సూత్రధారి లేడీ డాక్టర్.. భారత్‌లో జైషే మహిళా విభాగానికి ఈమే హెడ్!

పాక్‌లో ఈ విభాగానికి మసూద్ అజార్ సోదరి సాదియా అజార్ చీఫ్‌గా వ్యవహరిస్తోంది. ఢిల్లీ పేలుడులో ఆమె కూడా కీలకంగా వ్యవహరించినట్టు సమాచారం.

కాందహార్ హైజాక్ మాస్టర్ మైండ్ యూసఫ్ అజార్‌కు సాదియా భార్య. పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతీకారంగా మే 7న భారత సైన్యం చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌లో హతమైన ఉగ్రవాదుల్లో యూసఫ్ కూడా ఒకరు.

అధికారులు తెలిపిన ప్రకారం డాక్టర్ షహీనా షాహీద్ లక్నోలోని లాల్ బాగ్‌కు చెందినవారు. ఫరీదాబాద్‌లోని జైషే ఉగ్ర కుట్ర భగ్నం చేసిన తర్వాత ఆమెను అదుపులోకి తీసుకున్నారు. దాడులకు నిధులు, ఉగ్రవాద ఆపరేషన్లను సులభతరం చేయడానికి కీలకంగా వ్యవహరించినట్టు భావిస్తున్నారు. షహీనాకు చెందిన కారులోనే ఏకే–47 రైఫిల్ స్వాధీనం చేసుకున్నారు. అల్–ఫలాహ్ యూనివర్సిటీలో పనిచేస్తోన్న షహీనాకు.. కశ్మీర్ డాక్టర్ ముజామిల్ గనాయ్ అలియాస్ ముసైబ్‌తో సన్నిహిత సంబంధాలు ఉన్నట్టు తెలిసింది. ఫరీదాబాద్‌లో అతడు అద్దెకు తీసుకున్న రెండు గదుల నుంచి 2,900 కిలోల పేలుడు పదార్థాలు లభ్యం కావడం ముజామిల్‌ను అరెస్ట్ చేశారు.

జమ్మూ కశ్మీర్‌లోని పుల్వామాలో కోయిల్‌కు చెందిన ముజామిల్ అల్ ఫలాహ్ యూనివర్సిటీలో వైద్యుడిగా పనిచేస్తున్నారు. శ్రీనగర్‌లో సైనికులను హెచ్చరిస్తూ జైషే మహమ్మద్‌కు మద్దతుగా పోస్టర్లు అతికించిన కేసులో జమ్మూ కశ్మీర్ పోలీసులు అతడ్ని అరెస్ట్ చేయడంలో ఉగ్రకుట్ర వెలుగులోకి వచ్చింది. రైఫిల్, పిస్టల్, పేలుడు పదార్థాలను దాచిపెట్టిన కారును షహీనాదిగా దర్యాప్తు అధికారులు గుర్తించారు. విచారణలో అతడు ఇచ్చిన సమాచారం ఆధారంగా అమ్మోనియం నైట్రేట్‌గా భావిస్తోన్న 350 కిలోల పేలుడు సామాగ్రి, 20 టైమర్లు, ఇతరు అనుమానిత వస్తువులను స్వాధీనం చేసుకున్నారు.

ఇక, భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌తో జైషే ఉగ్రవాద సంస్థకు కోలుకోలేని దెబ్బ తగిలింది. దీంతో తిరిగి తన ప్రభావాన్ని విస్తరించేందుకు కసరత్తు ప్రారంభించింది. ఆ ప్రయత్నాల్లో భాగంగా 'జమాత్ ఉల్ మొమినాత్' పేరుతో తొలిసారి మహిళా విభాగం ఈ అక్టోబర్‌లో ఏర్పాటు చేసినట్లు సమాచారం.

నిఘా వర్గాల ప్రకారం ఈ కొత్త విభాగానికి నియామక ప్రక్రియ అక్టోబర్ 8న బహావల్పూర్‌లో ఉన్న మర్కజ్ ఉస్మాన్–ఓ–అలీ కేంద్రంలో మొదలైంది. దీనికి నేతృత్వం వహించేది మసూద్ అజ్హర్ సోదరి సాదియా అజ్హర్. ఈ సంస్థ, బహావల్పూర్, కరాచీ, ముజఫరాబాద్, కోట్లీ, హరిపూర్, మాన్సెహ్రాలో ఉన్న తమ విద్యా కేంద్రాల్లో అభ్యసిస్తున్న ఆర్థికంగా బలహీనమైన మహిళలను, అలాగే జైషే కమాండర్ల భార్యలను కూడా ఇందులో చేర్చుకుంటున్నారు.

# సాహిత్య శిఖరం అందెశ్రీకి జర్నలిస్టుల నివాళి



**ఖమ్మం బ్యూరో, 11 నవంబర్ (కెరటం న్యూస్):** ప్రజాకవి, తెలంగాణ గేయ రచయిత అందశ్రీ మరణం యావత్తు తెలంగాణ ప్రజానీకానికి తీరని లోటును మిగిల్చిందని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ జిల్లా ప్రధాన కార్యదర్శి చిర్రా రవి, జాతీయ కౌన్సిల్ సభ్యులు వెన్నబోయిన సాంబశివరావులు అన్నారు. ఖమ్మం నగరంలోని మయూరి సెంటర్లో గల అమరవీరుల స్తూపం వద్ద తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం అందెశ్రీకి జర్నలిస్టులు పూలమాలలు వేసి ఘన నివాళు లర్పించారు. అమరహై అందెశ్రీ, జోహార్ అందెశ్రీ అంటూ జర్నలిస్టులు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా చిర్రా రవి, సాంబశివరావులు మాట్లాడుతూ.. చదువు రాకపోయినప్పటికీ అద్భుతమైన తెలంగాణ ఉద్యమ పాటలు, తెలంగాణ సంస్కృతి సంప్రదాయాల గేయాలు రచించి తెలంగాణ స్వరాష్ట్ర మలిదశ ఉద్యమంలో అందెశ్రీ మూలస్తంభంగా నిలిచారని కొనియాడారు. అందెశ్రీ పాటలను గుర్తించిన నేటి తెలంగాణ ప్రభుత్వం జయ జయహే తెలంగాణ గీతాన్ని తెలంగాణ జాతీయ గేయంగా గుర్తింపునిచ్చి పురస్కారం అందించడం అభినందనీయ మన్నారు. అలాంటి మహాకవి అందెశ్రీ నేడు మన మధ్య లేకపోవడం చాలా బాధాకరమని, ఆయన ఆశయాలను, పోరాట స్ఫూర్తిని భవిష్యత్తు తరాలకు తెలియజేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందని గుర్తు చేశారు. నివాళులు అర్పించిన వారిలో టీజేఎఫ్ జిల్లా నాయకులు రాంశెట్టి విజేత, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా ప్రధాన కార్యదర్శి శెట్టి రజినీకాంత్, కెరటం న్యూస్ ఎడిటర్ వనం నాగయ్య, మందుల ఉపేందర్, కలవకొలను హరీష్ రాజు, మందటి వెంకటరమణ, ఖమ్మం ప్రెస్ క్లబ్ అధ్యక్షులు గుద్దేటి రమేష్ బాబు, ప్రధాన కార్యదర్శి కొరకొప్పుల రాంబాబు, టిఎస్ చక్రవర్తి, ఎలక్ట్రానిక్ మీడియా నగర అధ్యక్ష కార్యదర్శులు యలమందల జగదీష్, కరీష అశోక్, కెమెరామెన్ అసోసియేషన్ అధ్యక్షులు నాగరాజు, జిల్లా నాయకులు తిరుపతిరావు, హుస్సేన్, గోవింద్, దూసరి కళ్యాణ్, సాయి, సుధాకర్, గణేష్, యాదగిరి, ఉపేందర్, వంగూరి ఈశ్వరి, వుల్లోజు రమేష్, శ్రీధర్, నరేష్, ఇస్సంపల్లి వెంకటేశ్వర్లు, దండాల ప్రభాకర్ రెడ్డి, మందా వెంకటేశ్వర్లు, శంకర్, మనోజ్, కొండలు, సతీష్, హరి, బాబు, రాజు, పెంటి వెంకటేశ్వర్లు తదితరులున్నారు.



# కరాటే పోటీలలో ప్రతిభ చాటిన త్రివేణి విద్యార్థులు



**ఖమ్మం ఎడ్యుకేషన్, 11 నవంబర్ (కెరటం న్యూస్):** 9వ తారీఖు వరంగల్ నగరంలో ని కీర్తి గార్డెన్స్ లో జరిగిన సౌత్ ఇండియా WFSKO కరాటే ఛాంపియన్షిప్ 2025 లో త్రివేణి పాఠశాలకు చెందిన కీర్తన కట ఈవెంట్ లో మొదటి స్థానం, స్టాలిన్ కుమితే ఈవెంట్ లో మొదటి స్థానం మరియు కట ఈవెంట్ లో ద్వితీయ స్థానం, చరిత్ జోయల్ కటా ఈవెంట్లో ద్వితీయ స్థానం సాధించారు. పోటీలలో విజయం సాధించిన విద్యార్థిని విద్యార్థులను పాఠశాల డైరెక్టర్ డాక్టర్ గొల్లపూడి వీరేంద్ర చౌదరి అభినందించారు పాఠశాల ప్రిన్సిపల్ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ త్రివేణి విద్యార్థులు కర్యులర్ మరియు కోకర్యులర్ విషయాలలో తమ ప్రతిభ కనబరిచి ఎల్లప్పుడు ఉత్తమ ఫలితాలతో ఉన్నత స్థానంలో నిలుస్తారని అన్నారు.ఈ కార్యక్రమంలో కృష్ణవేణి త్రివేణి విద్యాసంస్థల డైరెక్టర్ యార్లగడ్డ వెంకటేశ్వరరావు పాఠశాల సి ఆర్ ఓ కాట్రగడ్డ మురళీకృష్ణ పాఠశాల వైస్ ప్రిన్సిపల్ స్వప్న ముస్తఫా మరియు కరాటే మాస్టర్ వీరన్న, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# పేదలకు ఆరోగ్య భరోసా!

## మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి చొరవ : 83 మందికి రూ. 29 లక్షల సహాయం



**ఖమ్మం, 11 నవంబర్ (కెరటం న్యూస్):** పేద ప్రజల కష్టాలను తీర్చడమే నిజమైన ప్రజాప్రతినిధి లక్షణమని నమ్ముతూ... తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి పాలేరు నియోజకవర్గ ప్రజలకు అండగా నిలుస్తున్నారు. వైద్య సహాయం అవసరమైన లబ్ధిదారుల కోసం ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కులను వేగవంతం చేయడంలో ఆయన కీలక పాత్ర పోషిస్తున్నారు. ఖమ్మం క్యాంపు కార్యాలయంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఖమ్మం రూరల్ మండలం, ఏదులాపురం మున్సిపాలిటీకి చెందిన లబ్ధిదారులకు ఈ చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జి తుంబూరు దయాకర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... మంత్రి పొంగులేటి కృషితో పాలేరు నియోజకవర్గానికి ప్రతి నెలా దాదాపు రూ. 1 కోటి విలువైన సీఎంఆర్ఎఫ్ నిధులు మంజూరవుతున్నాయని తెలిపారు. ఈ నిధులతో నెలకు 400 మందికి పైగా లబ్ధి పొందుతున్నారని వెల్లడించారు. తాజా పంపిణీలో 83 మంది లబ్ధిదారులకు సుమారు రూ. 29 లక్షల విలువ చేసే చెక్కులను అందజేయడం జరిగింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో మంత్రులు మల్లు భట్టి విక్రమార్క, పొంగులేటి శ్రీనివాస రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు ఉమ్మడి ఖమ్మం జిల్లా అభివృద్ధికి కట్టుబడి ఉన్నారని దయాకర్ రెడ్డి స్పష్టం చేశారు. సీఎంఆర్ఎఫ్ సహాయం అందుకున్న పేద ప్రజలు తమ ఆనందాన్ని వ్యక్తం చేస్తూ ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న తమకు ప్రభుత్వం అందించిన ఈ సహకారం ఎంతో గొప్పదని కృతజ్ఞతలు తెలిపారు.

# డిసెంబర్ 1న ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు



**ఖమ్మం టౌన్, 11 నవంబర్ (కెరటం న్యూస్):** 2025 డిసెంబర్ ఒకటో తారీకు ఉదయం 10 గంటలకు అల్లీపూరం నందు దైవ కృపా మినిస్ట్రీస్ లోని ప్రార్థన మందిరంలో అద్భుత క్రిస్మస్ ఆరాధన మహోత్సవం ఖమ్మం జిల్లా పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో పాస్టర్స్ ఫెలోషిప్ ఐక్యవేదిక ఆధ్వర్యంలో జరుగుతున్నదని ఈరోజు జరిగిన మీడియా సమావేశంలో అధ్యక్షులు తిమోతి గౌరవాధ్యక్షులు వేముల సత్యం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. ప్రధాన కార్యదర్శి రాంబాబు అధ్యక్షతన గత నాలుగు సంవత్సరాలుగా డిసెంబర్ 1వ తేదిన ఘనంగా ఖమ్మం జిల్లా వ్యాప్తంగా ఉన్నటువంటి అందరు దైవ సేవకులు పాస్టర్స్ బిషప్పులు అన్ని ఫెలోషిప్స్ హెడ్స్ పాల్గొని ప్రతిఏటా దేవుని మహిపరిచినట్లుగా ఈసంవత్సరం కూడా గత ఏడాది కంటే ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలియజేస్తూ ప్రేమతో అందరిని ఆహ్వానిస్తున్నామని ఈ సెమీ క్రిస్మస్ ఆరాధన కార్యక్రమంలో వర్తమానికులు రాజమండ్రి, కొవ్వూరు ప్రాంతం దొమ్మేరు గ్రామంలోని పరిచర్య చేస్తున్నటువంటి ఇంటర్నేషనల్ స్పీకర్ సహోదరులు రవికుమార్ ఫ్యాషన్ ఫర్ నేషన్ మినిస్ట్రీస్ వారు చక్కని వర్తమానం అందించటానికి ఖమ్మంలో జరిగే సెమీ క్రిస్మస్ ఆరాధన వేడుకలకు వస్తున్నారని అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సమన్వయకర్త రాధాకృష్ణ, సలహాదారులు ప్రసాద్ రావు, నరసయ్య, జిల్లా సమన్వయకర్త పానుగంటి రాజరత్నం, ఎర్నెస్ట్ పాల్, జార్జిములర్ ఎలీషా తదితరులు పాల్గొన్నారు.

# త్రివేణిలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలు



**ఖమ్మం ఎడ్యుకేషన్, 11 నవంబర్ (కెరటం న్యూస్):** త్రివేణి లో మౌలానా అబుల్ కలాం ఆజాద్ జన్మదినం సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా త్రివేణి పాఠశాల డైరెక్టర్ డాక్టర్ గొల్లపూడి వీరేంద్ర చౌదరి గారు మాట్లాడుతూ మౌలానా అబుల్ కలాం ఆజాద్ భారతదేశానికి మొదటి విద్యాశాఖ మంత్రిగా పనిచేసారు. ఆయన గౌరవార్థం ఆయన పుట్టినరోజును జాతీయ విద్యా దినోత్సవంగా జరుపుకోవాలని 2008, సెప్టెంబరు 11న కేంద్ర మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ ప్రకటించింది అని తెలియజేశారు. ప్రిన్సిపల్ రాజేంద్రప్రసాద్ గారు మాట్లాడుతూ మౌలానా అబుల్ కలాం ఆజాద్ పుట్టినరోజు సందర్భంగా విద్య, జాతీయాభివృద్ధికి, సంస్థల బలోపేతానికి ఆయన చేసిన సేవలను నేడు స్మరించుకుంటారు. ఈ రోజు చదువు విలువ గురించి అవగాహన కల్పించడానికి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తారు. తద్వారా ప్రజలకు విద్య ఆవశ్యకతపై అవగాహన పెంచి, ఎక్కువ మంది పిల్లలను స్కూళ్లకు రప్పించే ఏర్పాట్లు చేస్తారు అని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో త్రివేణి కృష్ణవేణి సంస్థల అధిపతి వై వెంకటేశ్వర రావు గారు సి ఆర్ ఓ మురళీకృష్ణ గారు వైస్ ప్రిన్సిపల్ ముస్తఫా స్వప్న గారు మరియు క్యాంపస్ ఇంచార్జ్ చార్లెస్ సందీప్ ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఉద్యోగ సమస్యలను పరిష్కరించాలి



**ఖమ్మం టౌన్, 11 నవంబర్ (కెరటం న్యూస్):** తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్ అసోసియేషన్ జిల్లా కార్యవర్గ సమావేశం స్థానిక టీజీవో భవన్ నందు అధ్యక్ష కార్యదర్శులు కొంగర వెంకటేశ్వరరావు, మోదుగు వేలాద్రి అధ్యక్షత నిర్వహించటం జరిగింది. ఈ కార్యక్రమంలో మాట్లాడుతూ ఉద్యోగులకు రావలసిన బకాయిలను వెంటనే విడుదల చేయాలని, బకాయి పడ్డ డి ఎ లను వెంటనే విడుదల చేయాలని, పిఆర్సి నీ వెంటనే అమలు చేసి మెరుగైన పిఆర్సి ని ఇవ్వాలని, ఉద్యోగులు దాచుకున్న జిపిఎఫ్, టి ఎస్ జి ఎల్ ఐ, సరెండర్ లీవ్, బకాయిలను, రిటైర్మెంట్ బెనిఫిట్స్ లను వెంటనే విడుదల చేయాలని, ఉద్యోగుల హెల్త్ కార్డులను వెంటనే మంజూరు చేయాలని, సెప్టెంబర్ నెలలో జరగవలసిన డిపార్ట్మెంటల్ ప్రమోషన్ కమిటీని ఏర్పాటు చేసి వివిధ డిపార్ట్మెంట్లో ఖాళీగా ఉన్న పోస్టులకు ప్రమోషన్ల ఇవ్వాలని కోరడమైనది. ఈ మధ్యన విడుదల చేసిన కొన్ని బకాయిలకు కృతజ్ఞతలు తెలియజేస్తూ పెండింగ్ లో ఉన్న అన్ని రకాల బకాయిలను కూడా వెంటనే విడుదల చేయాలని తీర్మానించడం అయినది ,మరియు 2026 సంవత్సరపు నూతన డైరీ గురించి కూడా కార్యవర్గంలో చర్చించడమైనది, ప్రభుత్వ పథకాలను కార్యక్రమాలను టీజీవో డైరీ ద్వారా యాడ్ రూపంలో ఇవ్వడానికి గౌరవ కలెక్టర్ గారు జిల్లా అధికారులు సహకరించాలని కోరడమైనది. 2026 టీజీవో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని కూడా వేగవంతం చేయాలని తీర్మానించడం అయినది. నూతనముగా రాష్ట్ర కార్యవర్గంలో ఖమ్మం జిల్లా నుండి ఎన్నికైన కొండపల్లి శేషు ప్రసాద్ ని జిల్లా కార్యవర్గం ఘనంగా సన్మానించి అభినందించడమైనది, జిల్లా కార్యవర్గంలో ఖాళీ అయిన స్థానాలకు జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ 2 గా గంగవరపు నరేందర్ సబ్ రిజిస్టర్ ను, ఉపాధ్యక్షులుగా జి రమేష్ బాబు హెడ్మాస్టర్ ని ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు కార్యవర్గం తీర్మానించడమైనది. ప్రజాకవి అందెశ్రీ గారి అకాల మరణానికి జిల్లా కార్యవర్గం ఘన నివాళులు అర్పించడం జరిగింది. ఈ కార్యవర్గ సమావేశంలో అసోసియేట్ అధ్యక్షులు మల్లెల రవీంద్ర ప్రసాద్, ట్రెజరర్ సూరంపల్లి రాంబాబు, హౌస్ బిల్డింగ్ సొసైటీ కార్యదర్శి డాక్టర్ పి విజయ్ కుమార్, జిల్లా కార్యవర్గ సభ్యులు కనపర్తి వెంకటేశ్వర్లు, సతీష్, హరీష్, పుష్పరాజ్, సింహాచలం, డాక్టర్ బి బాబు రత్నాకర్, భాస్కర్ రావు, తమ్మిశెట్టి శ్రీనివాస్, బానోతు నాగేశ్వరరావు, మోదుగు వెంకటేశ్వర్లు, మల్లయ్య, తాజుద్దీన్ గెజిటెడ్ అధికారులు పాల్గొన్నారు.

# అబుల్ కలాం గులాం మొహియుద్దీన్ 137 వ జయంతి వేడుకలు

**ఖమ్మం బ్యూరో, 11 నవంబర్ (కెరటం న్యూస్):** జిల్లా కాంగ్రెస్ కార్యాలయం సంజీవరెడ్డి భవన్ లో ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు, విద్యా వ్యాప్తికి కృషి చేసిన యోధుడు, భారతదేశ మొట్ట మొదటి విద్యాశాఖ మాత్యులు స్వర్గీయ మౌలానా అబుల్ కలాం ఆజాద్ గారి 137 వ జయంతి సందర్భంగా వారి చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘన నివాళులు అర్పించిన జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ , నగర కాంగ్రెస్ కమిటి అధ్యక్షులు మహ్మద్ జావేద్, శాసనమండలి మాజి సభ్యులు పోట్ల నాగేశ్వరరావు,శాసనసభ మాజి సభ్యులు కొండబాల కోటేశ్వరరావు గారు. ఈ కార్యక్రమంలో వీరితో పాటు జిల్లా కాంగ్రెస్ నాయకులు చోటా బాబా, జిల్లా సేవాదళ్ అధ్యక్షులు సయ్యద్ గౌస్, జిల్లా ఓబీసీ సెల్ అధ్యక్షులు పుచ్చకాయల వీరభద్రం, కొంటెముక్కల నాగేశ్వరరావు, జిల్లా ఓబీసీ సెల్ ఉపాధ్యక్షులు గజ్జి సూర్యనారాయణ,బమ్మిడి శ్రీనివాస్ యాదవ్, సామినేని వెంకటయ్య, కార్పొరేటర్ రాపర్తి శరత్, మాజి కౌన్సిలర్ పాలకుర్తి నాగేశ్వరరావు, నగర ఓబీసీ, ఎస్టీ, మైనారిటీ, ఐ యన్ టి యు సి అధ్యక్షులు బాణాల లక్ష్మణ్, శంకర్ నాయక్, షేక్ అబ్బాస్ బేగ్, నరాల నరేష్,కన్నం వైష్ణవి ప్రసన్నకృష్ణ, రజీ భాయ్, జహీర్, గడ్డం వెంకటయ్య, నూకారపు వేంకటేశ్వరరావు, బీరెడ్డి రమేష్, ముక్రం, ఫజల్, బందేల నాగార్జున, చంద్రిక, జాని, రమణ, సందీప్, శ్రీధర్ తదితర నాయకులు పాల్గొన్నారు. అనంతరం ముదిగొండ మండలంలో పలు కార్యక్రమాల్లో పాల్గొన్న జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్

పైలాన్ నిర్మాణ పనులను పరిశీలించిన జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు

ముదిగొండ మండలం వెంకటాపురం గ్రామంలో తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు పాదయాత్ర గుర్తు గా నిర్మిస్తున్న పైలాన్ నిర్మాణ పనులను జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, obc సెల్



జిల్లా అధ్యక్షులు పుచ్చకాయల వీరబద్రం మరియు మండల కాంగ్రెస్ నాయకుల తో కలిసి పరిశీలించి పనులను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమం లో మండల కాంగ్రెస్ అధ్యక్షులు కొమ్మినేని రమేష్ బాబు మేడేపల్లి సొసైటీ చైర్మన్ సామినేని వెంకటయ్య గారు మాజీ జడ్పీటీసీ పసుపులేటి దేవేందర్ గారు మండల కాంగ్రెస్ నాయకులు గుడిపూడి బుచ్చిరామయ్య గారు గ్రామ శాఖ అధ్యక్షులు కందుల బాలచందర్ ఉపాధ్యక్షులు గంట వెంకట్రావు మాదాపురం గ్రామ శాఖ అధ్యక్షులు ఉప్పునూరి వెంకటరెడ్డి కిసాన్ సెల్ అధ్యక్షులు కందుల శంకరయ్య గారుగోకినపల్లి బీసీ సెల్ అధ్యక్షులు మీగడ నాగేశ్వరావు పమ్మి కాంగ్రెస్ నాయకులు శివ గ్రామ కాంగ్రెస్ నాయకులు కట్ల సత్యనారాయణ పుల్లయ్య గంట శ్రీను మస్తాన్ పాల్గొన్నారు

# సాహితీ శిఖరం అందెశ్రీ

## త్రివేణి లో అందెశ్రీకి నివాళులు





**ఖమ్మం ఎడ్యుకేషన్, 11 నవంబర్ (కెరటం న్యూస్):** అనారోగ్యంతో తెల్లవారుజామున మరణించిన ప్రముఖ రచయిత అందెశ్రీకి త్రివేణి యాజమాన్యం మరియు విద్యార్థులు ఆయన మృతి పట్ల దిగ్భ్రాంతి తెలియజేశారు. ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా త్రివేణి విద్యా సంస్థల డైరెక్టర్ డాక్టర్ గొల్లపూడి వీరేంద్ర చౌదరి గారు మాట్లాడుతూ అందెశ్రీ అసలు పేరు అంద ఎల్లయ్య. ఆయన 1961 జులై 18న సిద్దిపేట జిల్లా రేబర్తిలో జన్మించారు. గొర్రెల కాపరిగా జీవన ప్రస్థానం ప్రారంభించారు. భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేశారు. పాఠశాల చదువు లేకుండానే కవిగా రాణించారు. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించారు. 'మాయమైపోతున్నడమ్మా' గీతంతో మంచి పేరు తెచ్చుకున్నారు. కాకతీయ యూనివర్సిటీ నుంచి గౌరవ డాక్టరేట్ అందుకున్నారు. అందెశ్రీ రాసిన 'జయ జయహే తెలంగాణ'ను రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రగీతంగా గుర్తించిన విషయం తెలిసిందే. ఆయనకు ఇటీవల తెలంగాణ ప్రభుత్వం రూ.కోటి పురస్కారం అందించింది అని తెలియజేశారు. ప్రిన్సిపల్ రాజేంద్రప్రసాద్ గారు మాట్లాడుతూ ఆశు కవిత్వం చెప్పడంలో అందెశ్రీ దిట్ట. 2006లో గంగ సినిమాకు ఆయనకు నంది పురస్కారం లభించింది. 2014లో అకాడమి ఆఫ్ యూనివర్సల్ గ్లోబల్ పీస్ డాక్టరేట్ వరించింది. 2015లో దాశరథి సాహితీ పురస్కారం, రావూరి భరద్వాజ సాహితీ పురస్కారం అందుకున్నారు. 2022లో జానకమ్మ జాతీయ పురస్కారం, 2024లో దాశరధీ కృష్ణమాచార్య సాహితీ పురస్కారం లభించింది. అందెశ్రీ లోకానాయక్ పురస్కారాన్ని అందుకున్నారు అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో త్రివేణి కృష్ణవేణి సంస్థల అధిపతి వై వెంకటేశ్వర రావు సి ఆర్ ఓ మురళీకృష్ణ వైస్ ప్రిన్సిపల్ ముస్తఫా స్వప్న క్యాంపస్ ఇంచార్జ్ చార్లెస్ సందీప్ ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# 17న పెన్షనర్ల మహాధర్నాను జయప్రదం చేయండి




**ఖమ్మం టౌన్, 11 నవంబర్ (కెరటం న్యూస్):** ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన పెన్షనర్ల బకాయిల చెల్లింపుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం అవలంభిస్తున్న ఉదాసీన వైఖరికి నిరసనగా ఈనెల 17న హైదరాబాద్ లోని ఇందిరా పార్కులో జరిగే మహాధర్నాను జయప్రదం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం (ఎస్జీపిఏటి )రాష్ట్ర కార్యదర్శి మేరీ ఏసుపాదం పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం (ఎస్జీపిఏటి)సమావేశం మంగళవారం జిల్లా అధ్యక్షులు పరిశ పుల్లయ్య అధ్యక్షతన కృషి భవన్ లో జరిగింది. ఈ సమావేశంలో -మేరీ ఏసుపాదం మాట్లాడుతూ దాదాపు 18 మాసాలుగా పెన్షనర్లకు రావాల్సిన నగదు బకాయిలను చెల్లించడంలో ఈ ప్రభుత్వం పూర్తిగా -వైఫల్యం చెందిందన్నారు. ఉద్యోగ విరమణ అనంతరం ఉద్యోగులు తమ భవిష్యత్తు జీవితాన్ని గురించి కొన్ని ప్రణాళికలను -రూపొందించుకుంటారని ప్రభుత్వ వైఖరి ఆ ప్రణాళికలతో పాటు ఉద్యోగ విరమణ చేసిన వారి ఆలోచనలను ఛిద్రం చేసిందని ఆమె -ఆరోపించారు. ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్న సమయంలో పొదుపు చేసుకున్న డబ్బులను సైతం ప్రభుత్వం ఇవ్వలేకపోవడం అత్యంత దురదృష్టకరమని ఆమె అన్నారు. పెన్షనర్ల బకాయిలతో పాటు పెన్షనర్లకు సంబంధించిన పలు సమస్యలు పెండింగులో ఉన్నాయని ఆమె తెలిపారు. హెల్త్ కార్డులు వస్తున్నాయని లీకులిస్తున్నారని,డిఏ, పిఆర్సి గడువు తీరినా ఆచరణలోనికి రాకపోవటం శోచనీయం అని అన్నారు. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా 10వేల మందికి పైగా పెన్షనుదారులు ఆర్ధిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారన్నారు. ప్రభుత్వ వైఖరికి నిరసనగా రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల జేఏసి ఆధ్వర్యంలో ఇందిరా పార్కులో ధర్నా నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు. ప్రభుత్వం దిగి వచ్చి పెన్షనర్ల సమస్యలను పరిష్కరించేంత వరకు వివిధ రూపాలలో -ఆందోళనలను కొనసాగిస్తామని ఆమె హెచ్చరించారు. ఈ సందర్భంగా 17న జరిగే మహా ధర్నా పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రాయల రవికుమార్, ఉపాధ్యక్షులు పెదమాళ్ల సత్యనారాయణ, శ్యాంసుందర్, కార్యదర్శులు బెల్లం రాధాకృష్ణమూర్తి, ఉడుగు సుధాకర్, తాడి అంజలి, దుగ్గినేని శ్రీనివాసరావు, నూతలపాటి నాగేశ్వరరావు, ఆదినారాయణ, జి. వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ మట్టి వాసన అందెశ్రీ కవిత్వం

## టియూడబ్ల్యూజె(ఐజెయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రాం నారాయణ





**ఖమ్మం బ్యూరో, 11 నవంబర్ (కెరటం న్యూస్):** తెలంగాణ మట్టి వాసనకు ప్రతిబింబం అందెశ్రీ కవిత్వమని టియూడబ్ల్యూజె(ఐజెయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రాంనారాయణ పేర్కొన్నారు. ప్రెస్‌క్లబ్ కమిటీ ఆధ్వర్యంలో ప్రజా రచయిత, కాలమిస్ట్ అందెశ్రీ సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా అందెశ్రీ చిత్రపటానికి పూలమాలలు వేసి పలువురు జర్నలిస్టులు నివాళులర్పించారు. అనంతరం ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు నామా పురుషోత్తం అధ్యక్షతన జరిగిన సభలో కె.రాంనారాయణ మాట్లాడుతూ నిరుపేద, నిరక్షరాస్యుడైన అందెశ్రీ గొర్రెల కాపరి నుండి ప్రజాకవిగా ఎదిగాడని అన్నారు. పల్లె జీవితంలోని కన్నీళ్లు, కష్టాలు, ప్రకృతిలో మార్పులు, మనుషుల బాధలను లోతుగా గమనించడం, అనుభవించడం ద్వారా అందెశ్రీ సహజసిద్ధమైన, హృదయాన్ని కదిలించే ఆసు కవిత్వంతో అతితక్కువ సమయంలోనే ప్రజాకవిగా ఎదిగారన్నారు. తన పాటలతో ప్రత్యేక రాష్ట్ర ఉద్యమ కాంక్షను రగిల్చి లక్షలాది మందిని ఉద్యమ చైతన్యం వైపు నడిపించారన్నారు. ఆయన రాసిన జయజయహే తెలంగాణ' గీతం రాష్ట్ర గీతమైందన్నారు. ఆయన జీవితం, సాహిత్యం అందరికీ ఆదర్శనీయమన్నారు. ఆయన ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు జర్నలిస్టులు కృషి చేయాలన్నారు. యూనియన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మాటేటి వేణుగోపాల్, జిల్లా ప్రధాన కార్యదర్శి మైసా పాపారావు, స్తంభాద్రి హౌజింగ్ సొసైటీ అధ్యక్షులు కనకం సైదులు, యూనియన్ నగర కార్యదర్శి చెరుకుపల్లి శ్రీనివాస్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నగర కోశాధికారి ఏలూరి వేణు, ప్రెస్‌క్లబ్ కోశాధికారి కళ్యాణ్, ఉపాధ్యక్షులు గండారపు రామారావు, సహాయ కార్యదర్శి శివాజీ, నాయకులు మందా వెంకటేశ్వర్లు, టి.అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# అబుల్ కలాం ఆజాద్ చిరస్మరణీయులు

## దేశానికి ఆయన సేవలు మరువలేనివి

## కార్పొరేటర్ షేక్ మక్బూల్



**ఖమ్మం బ్యూరో, 11 నవంబర్ (కెరటం న్యూస్):** స్వాతంత్ర సమరయోధుడు, విద్యావేత్త అబుల్ కలాం ఆజాద్ చిరస్మరణీయుడనీ, దేశానికి ఆయన చేసిన సేవలు మరువలేనివని బిఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, 23వ డివిజన్ కార్పొరేటర్ షేక్ మక్బూల్ అన్నారు. మంగళవారం ఖమ్మం నగరం 23 వ డీవిజన శాంతినగర్ కమిటీ హాల్ లొ మౌలన అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా షేక్ మక్బూల్ మాట్లాడుతూ స్వాతంత్ర్య సమర యోదుడు, బారత తొలి విద్య శాఖమంత్రిగా పనిచేసి అనేకమంది ప్రశంసలను పొందారన్నారు. సౌది అరేబియా మక్కాలో జన్మించిన అబుల్ కలాం దేశ స్వాతంత్ర పోరాటంలో కీలకంగా వ్యవహరించారని పేర్కొన్నారు. 1905 - 1907 సంవత్సరంలో అల్ అజార్ యూనివర్సిటీ తో పాటు పిజు సాహిత్య అకాడమీ, లలీతకళా అకాడమి, యుజిసి మొదలైన ప్రముఖ విద్య సంస్థలను స్థాపించారన్నారు. తత్వశాస్త్రం, గణితం అరబిక్, పెర్షియన్ భాషలలో నైపుణ్యం కలిగిన విద్యావేత్త అని పేర్కొన్నారు. అసలు పేరు మొహియుద్దీన్ ఆహ్మద్ అయినప్పటికీ అబుల్ కలాం అనే బిరుదు తోనే ప్రఖ్యాత పేరుగాంచారని పేర్కొన్నారు. పండితుడు, కవిగా అరబిక్, ఇంగ్లిష్ ఉర్దూ, హింది పెర్షియన్ బెంగాలి అనేక భాషలలో ప్రావిణ్యడుగా పేరు సాధించారన్నారు. 11 సంవత్సరాల పాటు విధ్యా శాఖ మంత్రిగా పని చేశారని 1912లో ఉర్దూలో ఆల్ హీలాల్ వార పత్రిక ప్రారంబించి హిందు-ముస్లిం ఐక్యత కోసం పోరాడిన వ్యక్తి అని కొనియాడారు.

1920 లో జాతీయ కాంగ్రెస్ లో పనిచేసిన అబుల్ కలాం 1940-46 కాంగ్రెస్ అధ్యక్షులుగా విభజనకు వ్యతిరేకంగా ఖిలాజిత్, సహయనిరాకరణ ఉద్యమం ఉప్పు సత్యగ్రహం, క్విట్ ఇండియా ఉద్యమాలలో కీలకంగా పాల్గొన్న ఆయన 10 సంవత్సరాల జైలు శిక్ష సైతం అనుభవించిన మహా వ్యక్తి అని ఆయనను స్మరించుకోవడం మన కర్తవ్యం అని అన్నారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ నగర కార్యదర్శి ఎస్.కె సకిన నాయకులు ఉస్మాన్, ఎస్.కె లాల, సలీం,యువజన నాయకుడు ఎస్.కె మునాప్ ,ప్రవంతి, ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

# సామినేని హంతకుల అరెస్టు చేయాలి

**డీజీపీకి సీపీఐ (ఎం) రాష్ట్ర నాయకుల వినతి**

**రాజకీయ కక్ష్యలతోనే హత్య**

**ఘటన జరిగి 12 రోజులైనా కేసును ఛేదించటంలో నిర్లక్ష్యం**



**ఖమ్మం బ్యూరో, 11 నవంబర్ (కెరటం న్యూస్):** ఖమ్మం జిల్లా చింతకాని మండలం పాతర్లపాడు గ్రామానికి చెందిన సీపీఐ (ఎం) రాష్ట్ర నాయకులు సామినేని రామారావు హంతకులను అరెస్ట్ చేయాలని కోరుతూ ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, పోతినేని సుదర్శన్ రావు, ఖమ్మం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాదినేని రమేష్, మధిర డివిజన్ కార్యదర్శి మడుపల్లి గోపాలరావు, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పెసరకాయల జంగారెడ్డి.. డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ) బి. శివధర్ రెడ్డికి హైదరాబాదులో మంగళవారం వినతి పత్రం సమర్పించారు. పార్టీకి చెందిన సామినేని రామారావును అక్టోబర్ 31వ తేదీన పాతర్లపాడు గ్రామంలో ఉదయం 5:30 గంటల సమయంలో అతి కిరాతకంగా హత్య చేశారని... ఈ ఘటన జరిగి ఇప్పటికీ 12 రోజులు అవుతున్నా నిందితులను అరెస్టు చేయటంలో పోలీస్ శాఖ నిర్లక్ష్యం వహిస్తున్నదని ఆరోపించారు.

రాజకీయ కక్షతోనే హత్య

రామారావు బతికి ఉంటే సీపీఐ (ఎం)ను ఓడించటం సాధ్యం కాదని భావించి రాజకీయ కక్షలతోనే ఆ గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు కుట్రపన్ని హత్య చేశారని ఆరోపించారు. హంతకులను నేను స్వయంగా చూశాను.. అని వారి పేర్లతో సహా రామారావు భార్య స్వరాజ్యం పోలీసులకు పిటిషన్ ఇచ్చినా ఇప్పటివరకు నిందితులను అరెస్టు చేయకపోవటాన్ని తప్పు పట్టారు. రామారావు నిస్వార్థ నాయకుడు, వారి స్వగ్రామానికి రెండుసార్లు ఆయన ఏకగ్రీవ సర్పంచిగా ఎన్నికయ్యారని తెలిపారు. రామారావు సతీమణి ఒకసారి గ్రామ సర్పంచ్ గా పనిచేసినట్లు పేర్కొన్నారు. గ్రామంలోని పేదలకు తమ సొంత భూమిని ఇండ్ల స్థలాల కోసం పంచిన చరిత్ర రామారావు కుటుంబానికి ఉందని తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శిగా రామారావు సేవలు అందించారని, సీపీఐ (ఎం)లో దాదాపు 50 ఏళ్లుగా కొనసాగుతున్నారని వివరించారు. గత కొంతకాలంగా తన స్వగ్రామం పాతర్లపాడు లో ఉంటూ అభివృద్ధికి పాటుపడుతున్నట్లు తెలిపారు. ఇది సహించలేని కాంగ్రెస్ నాయకులు ఆయన ఉంటే రాజకీయంగా తమ మనుగడ సాగదని భావించి, కుట్ర చేసి హత్య చేశారని ఆరోపించారు. ఈ హత్యకు కారణమైన వారందరినీ అరెస్టు చేసి చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ డీజీపీకి వినతిపత్రం అందజేశారు.

# ప్రజాకవి అందేశ్రీకి ఘన నివాళి

## టీజీఓస్ అసోసియేషన్ ఖమ్మం



**ఖమ్మం టౌన్, 11 నవంబర్ (కెరటం న్యూస్):** తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్ అసోసియేషన్ ఖమ్మం జిల్లా ఆధ్వర్యంలో ప్రజాకవి అందెశ్రీ గారికి ఘన నివాళి అర్పించారు ..ఈ కార్యక్రమంలో టీజీవో అధ్యక్ష కార్యదర్శులు కొంగర వెంకటేశ్వర్లు మోదుగు వేలాద్రి మాట్లాడుతూ అందెశ్రీ గారి అకాల మరణం నమ్మలేకుండా ఉన్నామని వారి ఆత్మకు శాంతి కలగాలని నివాళులర్పించడం జరిగింది. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించి తన రచనలు పాటల ద్వారా తెలంగాణ ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లారని ఒక సాధారణమైన వ్యక్తి అసాధారణమైన స్థాయికి చేరారని సమాజంలో అంతరించిపోతున్న మానవ విలువలపై తన గలాన్ని వినిపించారని నిప్పుల వాగు ద్వారా తెలంగాణ సాంస్కృతిక గీతాల అతిపెద్ద రచనలను చేశారని తెలంగాణ ప్రభుత్వం వారిని ఘనంగా సన్మానించిందని అనేక అవార్డులు డాక్టర్లు వ వరించాయని తెలంగాణ ప్రజల గుండెలలో అందెశ్రీ చిరస్థాయిగా నిలిచిపోతారని వివరించారు ఈ కార్యక్రమంలో టీజీవో అసోసియేట్ అధ్యక్షులు మల్లెల రవీంద్ర ప్రసాద్ గంగవరపు నరేందర్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొండపల్లి శేషు ప్రసాద్ ట్రెజరర్ సూరంపల్లి రాంబాబు హౌస్ బిల్లింగ్ సొసైటీ సెక్రటరీ డాక్టర్ పి విజయ్ కుమార్ టీజీవో కార్యవర్గ సభ్యులు జీ రమేష్ బాబు కనపర్తి వెంకటేశ్వర్లు సతీష్ హరీష్ డాక్టర్ పుష్పరాజ్ సింహాచలం భాస్కర్ రావు తమ్మిశెట్టి శ్రీనివాస్ తదితరులు హాజరై ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు.

# కస్తాల మాతృమూర్తికి ఘన నివాళులు



**ఖమ్మం టౌన్, 11 నవంబర్ (కెరటం న్యూస్):** ఖమ్మం జిల్లా తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు కస్తాల సత్యనారాయణ గారు టీజీవో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మాజీ జిల్లా కోశాధికారి కస్తాల వెంకటేశ్వరరావు అమ్మ కస్తాల రామ తులసమ్మ దశదినకర్మ సందర్భంగా వారి స్వగ్రామం కొండకోడిమ వైరా మండలం నందు శ్రద్ధాంజలి ఘటించిన తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షులు కొంగర వెంకటేశ్వరరావు కార్యదర్శి మోదుగు వేలాద్రి అసోసియేట్ అధ్యక్షులు మల్లెల రవీంద్ర ప్రసాద్ , హౌసింగ్ సొసైటీ కార్యదర్శి డాక్టర్ పి విజయ్ కుమార్ , జిల్లా సంక్షేమ అధికారిని గుడికందుల జ్యోతి మేడం రిటైర్డ్ ఎంపీడిఓ వెంకటపతి రాజు హెచ్ డబ్ల్యు జిల్లా అధ్యక్షులు రుక్మారావు టీజీవో జిల్లా కార్యవర్గ సభ్యులు ఆంతోటి తిరుపతిరావు, మోదుగు వెంకటేశ్వర్లు, గురుకుల రెసిడెన్షియల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి ఊటుకూరి దామోదర్ , టీఎన్జీవో రఘునాథపాలెం యూనిట్ అధ్యక్షులు వీరన్న తదితరులు పాల్గొన్నారు.